## క్లుప్తంగా

### రేపు మామిడి రైతుల సదస్సు

**నూజివీడు:** మామిడి రైతులు, ఎగుమతిదారులతో ఈనెల 4న పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సమావేశం నిర్వహిస్తామని కమిటీ సెక్రటరీ మూల్పూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మామిడి మార్కెట్ ఏర్పాటు, ఎగుమతులకు గల అవకాశాలపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి నూజివీడుతో పాటు చుట్టుపక్కల మండలాల రైతులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### రేపు వంగవీటి రంగా జయంతి

**మైలవరం:** దివంగత వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమం గురువారం జరుగుతుందని రాధారంగా మిత్రమండలి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రంగా విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు కేక్ కటింగ్, అనంతరం అన్నదానం కార్యక్రమం జరుగుతుందన్నారు. వంగవీటి రాధా, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, జనసేన నాయకులు అక్కల గాంధీ, బాల తదితరులు పాల్గొంటారని చెప్పారు.

### డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరువూరు:** 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాలలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ నెల 10వ తేదీలోగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు కేటాయిస్తారని చెప్పారు. ఇతర వివరాలకు తమ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు



**జూపూడి(ఇబ్రహీంపట్నం):** జూపూడిలోని గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గత నెల 30వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో స్వామివార్లకు మూడు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు జరిపారు. మంగళవారం చక్రస్నానం, పూర్ణాహుతితో పాటు భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. స్వామివారిని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించారు.

### నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి

**మైలవరం:** నీట్ సెట్ పరీక్ష పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ మైలవరం మండల కార్యదర్శి ఎం. చరణ్ డిమాండ్ చేశారు. మైలవరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సంచలనానికి దారితీస్తున్న పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, పార్లమెంట్‌లో చర్చ జరపాలని కోరుతూ ఈ నెల 4న విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయని, దీనికి మైలవరం మండలంలోని అన్ని విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. గత ఐదేళ్లలో 65 పేపర్ లీకేజీల ఘటనలు జరిగాయని, తక్షణమే విచారణ జరిపి నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పి. సాయి, సహాయ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

# వ్యాధుల కాలం.. జర భద్రం

**ఆగిరిపల్లి:** వర్షాకాలం అంటేనే వ్యాధులు ప్రబలే కాలం. ప్రధానంగా డయేరియా సోకుతుంది. ఈ వ్యాధి సోకిన రోగులకు సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి వచ్చిన వారిలో విరేచనాలు ఎక్కువగా అవుతుంటాయి. నీరసం, వికారం, వాంతులు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. శరీరంలో డీహైడ్రేషన్ అయ్యే పరిస్థితులు వస్తాయి. కలుషితమైన తాగునీరు, అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం ద్వారా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

డయేరియా బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. ఉడికీ ఉడకని మాంసారాన్ని తినకపోవడం మంచిది. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి**

మరోవైపు దోమల వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలు కూడా ప్రబలే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవడం, పాత వస్తువులు, పగిలిన సామగ్రిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. జ్వరాలు వస్తే వెంటనే వైద్యుని దగ్గరికి వెళ్లి తగిన చికిత్స చేయించుకోవాలి.

**తిరువూరులో డయేరియా నిర్మూలనకు సర్వే..**

**తిరువూరు:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. పట్టణంలో మంగళవారం జ్వరపీడితుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా లార్వా వృద్ధి చెంది తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. బాక్టీరియా, ఫంగస్ వ్యాప్తి చెంది జలుబు, దగ్గు, జ్వరం డయేరియా, టైఫాయిడ్, మలేరియా విజృంభిస్తాయని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని రేష్మాబేగం సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను విధిగా వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోతే సమీప ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు సర్వేలో పాల్గొన్నారు.



తిరువూరులో జ్వరపీడితుల సర్వే చేస్తున్న సిబ్బంది

**నిర్లక్ష్యం వద్దు..**



డయేరియా రావడానికి ముఖ్య కారణం కలుషితమైన ఆహారం, నీరు. విరేచనాలు అయితే తప్పనిసరిగా వైద్యుల సలహాలు తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఉండవచ్చు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు ఉపయోగించాలి.

–టీనా, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు

## 10న దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే

**మైలవరం:** కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక చట్టాలను రక్షించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఈ నెల 10న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరంలోని సీఐటీయూ కార్యాలయంలో డిమాండ్స్ డే కరపత్రాలను ముఠా కార్మికులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో 44 లేబర్ చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. వీటి వలన కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని చెప్పారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసే పరిస్థితి లేదని, ముఠా, ఆటో, వివిధ రంగాలలో ఉన్న అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు పట్టించుకోకుండా వెట్టి చాకిరీ చేయించుకునే పరిస్థితిలోకి చట్టాలను మారుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా ముక్తకంఠంతో ఈ నెల 10న డిమాండ్స్ డే సందర్భంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మారేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పి. సాయి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సుధాకర్, కార్మికులు

## కొండపల్లి ఐఓసీలో ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్‌ను అధికారులు, సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల డెప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ.శివకుమార్‌రెడ్డి నేతృత్వంలో ఐఓసీఎల్ పోల్ టెర్మినల్, గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ, గ్రౌండ్ స్టోరేజీలో నీటిని తొలగించే సమయంలో ఎదురయ్యే ప్రమాదాలపై వివిధ రకాల విన్యాసాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సైరన్ మోగించడం, అగ్నిమాపకదళ వాహనాలు చేరుకుని మంటలను అదుపు చేయడం, గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి వైద్యశాలకు తరలించడం వంటి విన్యాసాలను రెస్క్యూ ఆపరేషన్ టీమ్ కళ్లకు కట్టినట్లు నిర్వహించారు. మాక్‌డ్రిల్ విజయవంతంగా పూర్తిచేసిన ఉద్యోగులను డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివకుమార్‌రెడ్డి అభినందించారు.



ట్యాంకర్లను ఫోమ్ వాటర్‌తో తడుపుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది

## ఐటీఐ కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

**నూజివీడు:** పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులతో పాటు ప్రస్తుతం ఐటీఐ చదువుతున్న విద్యార్థులు సైతం ఈ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొనగా 79 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 56 మంది అర్హత సాధించారని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సి. మధుభూషణ్‌రావు, ఏలూరు ఐటీఐ కళాశాల ప్రధానాధికారి రజిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి (ఒకేషనల్ గైడెన్స్) వరలక్ష్మి, నేషనల్ కెరీర్ సర్వీసెస్ జి. ప్రవీణ్ కృష్ణ, డీఎస్‌డీఓ జి. సుధాకర్ పాల్గొన్నారు.



ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

### పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగర వీధుల్లో ఇష్టానుసారంగా పశువులను రోడ్లపైకి వదిలి వేయటంతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్లపై రాకపోకలకు అవరోధం కలిగించేలా పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాటిల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, నగరంలోని వీధుల్లో రోడ్లపై సంచరించే పశువులను సిబ్బంది ద్వారా స్వాధీనం చేసుకుని అజిత్‌సింగ్‌నగర్‌లో ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఉన్న క్యాటిల్ షెడ్ (బందుల దొడ్డి)కి తరలిస్తామని పేర్కొన్నారు. ఆయా పశువుల యజమానులు నగర పాలక సంస్థ వారికి తగిన ఆధారాలను చూపి, అపరాధ రుసుం చెల్లించి, అఫిడవిట్ సమర్పించి పశువులను తీసుకుని వారి స్వంత స్థలంలో ఉంచుకోవాలని, నిర్దేశించిన గడువు లోపల పశువులను తీసుకువెళ్లకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నాసా కాంటెస్ట్‌లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



**ఇబ్రహీంపట్నం:** నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ కాంటెస్ట్‌లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ ఐనూల్ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. 2023–24 ఏడాదికి జాతీయ స్థాయిలో జరిగిన కాంటెస్ట్‌లో శ్రీ చైతన్య నుంచి 23 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఏడుగురు విద్యార్థులు బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగిరిపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానం

**ఆగిరిపల్లి:** మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వర్షాకాలం కావడంతో రోడ్లపై పారుతున్న మురుగుతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక కొలుము బజార్‌లో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు రహదారిపై నిత్యం ప్రవహిస్తోంది. స్థానికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. యాదవ బజార్‌లో, పోలీస్‌స్టేషన్ రోడ్డులో మురుగు కాలువల్లో పూడిక పెరిగిపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులతో పాటు, దోమల విజృంభణతో వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గ్రామంలో పందుల సంచారం కూడా అధికంగా ఉండటంతో మెదడు వాపు వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలోని డ్రెయినేజీల్లో, మురుగు కాలువల్లో పూడికను తొలగించి దోమల మందును పిచికారీ చేయించాలని పలువురు కోరుతున్నారు.



ఆగిరిపల్లి కొలుము బజార్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



వేద పాఠశాల సమీపంలో సంచరిస్తున్న పందులు

## రేపు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్ కుమార్**

**నూజివీడు:** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 4న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నూజివీడులోని ఏఐఎస్ఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అనిల్ మాట్లాడుతూ రూ.30 లక్షలకు నీట్ పేపర్‌ను అమ్మేస్తూ సంపన్నుల పరీక్షగా తయారైందని ధ్వజమెత్తారు. నీట్ లీకేజీ వల్ల దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందన్నారు. వైద్య విద్య అనేది ప్రతిభ ఉన్న విద్యార్థులకు అందాలే తప్ప సంపన్నులకు కాదన్నారు. దేశవ్యాప్తంగా నీట్ ఎగ్జామ్ రాసిన విద్యార్థుల భవిష్యత్తు ఏమిటో తెలియక ర్యాంకులు కోల్పోయి అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయారన్నారు. నీట్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నేతృత్వం వహిస్తున్న నాటినుంచి అనేక అవకతవకలకు పాల్పడుతూనే ఉందని ధ్వజమెత్తారు. దీనిపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కూటమి నేతలు కూడా స్పందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే విధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 4న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ఈ బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గరికే అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉన్నం అనిల్‌కుమార్

## భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ

**వెల్వడం(మైలవరం):** శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో మైలవరం మండలం వెల్వడం గ్రామస్తులు ఏడుగురు బంగారు పతకాలు సాధించారు. ఇటీవల బెంగళూరు గణపతి సచ్చిదానందం స్వామీజీ ఆశ్రమం వారిచే శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీల కార్యక్రమం నిర్వహించారని వెల్వడం సీతారామచంద్రస్వామి దేవాలయం ధర్మకర్త వెల్వడపు సచ్చిదానందం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ధర్మకర్త వెల్వడపు సచ్చిదానందం పర్యవేక్షణలో బంగారు పతకాలు అందుకున్న చేగు లీలారాధిక, చనమోలు రత్నకుమారి, చేగు అరుణకుమారి, కల్లూరి భాగ్యలక్ష్మి, శీలం కళావతి, జూలూరు హారిక, గుడివాడ మౌనికలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్దిరాజు లీలావతి, చంద్రశేఖర భాను దంపతులు, కొణసాని ప్రభాకరరావు, కొల్లి వరప్రసాద్, పరికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న మహిళలు

## ఘనంగా రక్షణ సైన్యం ఆవిర్భావ దినోత్సవం

**ముసునూరు:** ప్రజలను ప్రేమ, శాంతి, రక్షణ మార్గాలలో నడిపేందుకే రక్షణ సైన్యం ఆవిర్భవించిందని సంఘ పాస్టర్ కెప్టెన్ ఎం.రాజు అన్నారు. ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, పెదపాటివారిగూడెం, వేల్పుచర్లలోని రక్షణ సైన్యం చర్చిల వద్ద మంగళవారం సంస్థ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముసునూరులో పాస్టర్ రాజు, వనిత దంపతులు సంఘ సభ్యులతో కలిసి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 1865 జూలై 2న ఇంగ్లండ్ రాజధాని లండన్‌లో విలియం, కేథరిన్ దంపతులు రక్షణ సైన్యం సంస్థను స్థాపించారన్నారు. ప్రస్తుతం 126 దేశాల్లో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను రక్షణ సైన్యం నిర్వహిస్తోందని వివరించారు. అనంతరం విశ్వాసులకు శాంతి, రక్షణ సందేశాన్ని అందించారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల సంఘ పెద్దలు, గృహ సమితి స్త్రీలు, యవ్వనస్తులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.



ముసునూరు రక్షణ సైన్యం చర్చి వద్ద సంస్థ ఆవిర్భావ వేడుకలు

## భక్తులను అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన ప్రణతి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ప్రణతి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని ఆరుబయటకు విచ్చేసిన భక్తులు చల్లటి గాలులలో చక్కటి నృత్య ప్రదర్శనను వీక్షించి ముగ్ధులయ్యారు.

## పరిశోధనా రంగాల్లో మహిళల పాత్ర పెరగాలి

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** పరిశోధనా రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని నాగాలాండ్ కేంద్రియ విశ్వవిద్యాలయం ఆచార్య ఉపాసనా బోరా సింహా అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎస్టీఈఎం పరిశోధనల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే వ్యూహాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య ఉపాసనా బోరా సింహా మాట్లాడుతూ వివిధ రంగాల్లో పరిశోధనలు చేసేందుకు ముందుకు వస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటోందన్నారు. ప్రధానంగా విద్యారంగంలో మహిళల సంఖ్య పెరిగినా ఆ మేర పరిశోధనల్లో కనపడటం లేదన్నారు. ఇది సరైనది కాదని అభిప్రాయపడ్డారు. మహిళలు పరిశోధనల్లో పాల్గొనేందుకు, రాణించేందుకు ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సామాజిక చైతన్యానికి, మానవ వికాసానికి సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. పరిశోధనా రంగాల్లో ఉన్న అవకాశాలను మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఆ దిశగా అవగాహనను పెంచుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించగా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య ఉపాసనా బోరా సింహా

## మోడల్ డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించండి

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి. సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేలప్రోలు సమీపంలోని అంపాపురంలో 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో అసోసియేషన్ ఆధ్వర్యంలో 2005లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్దదైన మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకట సత్య చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఉన్నారు.



జిల్లా కలెక్టర్ సృజనను మర్యాద పూర్వకంగా కలిసిన లారీ యజమానుల సంఘ సభ్యులు

## ఆదాయ పన్ను చెల్లించడం ఉద్యోగుల బాధ్యత

**డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్**

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఆదాయ పన్ను చెల్లించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ, విజయవాడ రైల్వే డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే ఆడిటోరియంలో ఆదాయ పన్నుపై ఉద్యోగులు, పెన్షనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌ఎం మాట్లాడుతూ చాలామంది ఆదాయ పన్ను దాఖలు చేయడంలో ఇతర వ్యక్తులపై ఆధారపడుతున్నారన్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే ఇది ఏమాత్రం కష్టతరం కాదన్నారు. ఆదాయ పన్ను నిబంధనలను చదివి, వాటిని అర్థం చేసుకుంటే పన్నులను సులభంగా సొంతంగానే ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పన్నులు ఫైలింగ్ చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పన్నుల ఎగవేతకు దారితీసే ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎన్. అభినయ మాట్లాడుతూ దేశ ఆదాయంలో ఆదాయ పన్నుల సేకరణ కీలకమైనప్పటికీ సరైన అవగాహనతో సులభ పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయ పన్ను నిబంధనలు, పరిజ్ఞానం, పన్ను చట్టాలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు, తప్పుడు క్లెయిమ్స్ తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించినట్లు చెప్పారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆదాయ పన్ను దాఖలు, పన్ను ప్రయోజనాలు, తగ్గింపులు, రిఫండ్ స్కామ్‌లు, రెడ్ ఫ్లాగ్ తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు.

కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.శ్రీనివాస్, సీనియర్ డీఎఫ్‌ఎం ఈ.శివరామకృష్ణ, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, సీనియర్ డీఎంఓ రవికుమార్, ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్లు డి.విజయ్‌బాబు, ఆర్.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

### ఆర్థికసాయం అందజేత

**పుట్రేల (విస్సన్నపేట):** తమతో కలిసి చదువుకున్న స్నేహితుడి వైద్యం కోసం పలువురు స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పుట్రేల జెడ్పీ హైస్కూల్‌లో 1997–98లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న తమ స్నేహితుడు బట్టగాని వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు రూ. రూ.1,05,000 ఆర్థిక సాయాన్ని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

### సామూహిక అక్షరాభ్యాసం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ మాట్లాడుతూ విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థికీ సరస్వతీ దేవి ఆశీస్సులు లభించాలని తాము సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ విద్యార్థులకు పలక, బలపాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.